జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

శనివారం | 11 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 12



# అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి..!

- -పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- -సంగెం గీసుగొండ మండలాల అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ..
- -ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్య అమలు
- -పాల్గొన్న జిల్లా కలెక్టర్ సత్య శారద



సంగెం, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి): అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేసి,మహిళలు మరియు చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యులు

మిగతా 2 లో...



# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఇప్ప పువ్వు,తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి
- అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ
- పంచాయతీరాజ్,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి): పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని,ఇప్ప పువ్వు ,తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి లభిస్తుందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని,అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలంగంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామం లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయల సిఆర్ఆర్ నిధులతో చేపట్టనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ

మిగతా 2 లో...



# యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

- జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవర్చుకోవాలి
- పంచాయితీరాజ్,స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని,రోజువారి జీవన శైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా దినచర్యగా అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయితీ రాజ్,గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి (ఆయుష్ డే)దినోత్సవ యోగ కార్యక్రమానికి మంత్రి సీతక్క,ములుగు జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రజల దినచర్యలో

మిగతా 2 లో...

# అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలి

- పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి అడుగులు వేద్దాం
- బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉన్నాం
- అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రతి ప్రాణాన్ని కాపాడటం మా లక్ష్యం.




వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ అలైవ్"కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని

మిగతా 2 లో...

# భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి) భద్రకాళి చెరువు పూడికతీత పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం కాజీపేట మండలం అమ్మవారిపేటలోని ప్రభుత్వ స్థలాలలో డంపింగ్ చేస్తున్న పూడిక మట్టిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువులో జరుగుతున్న పూడికతీత పనుల పురోగతిని తెలుసుకుని, మిగిలిన పనులను

మిగతా 5 లో...

## యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి...)



యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఉదయం 30 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకు యోగ చేయడం ద్వారా శరీరం మెదడు చురుకుగా పనిచేస్తాయని తెలిపారు. పురాతన కాలం నుండి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.సంపూర్ణమైన ఆరోగ్యం ద్వారా మాత్రమే మనిషి తన ఆశలను ఆశయాలను ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా యోగ దినచర్యగా అవలంబించు కోవడం ద్వారా శరీరానికి మనసుకి ఉపశమనం ఇస్తుందని పేర్కొన్నారు.ప్రతి రోజూ కనీసం 45-50 నిమిషాల యోగా, వ్యాయామం చేయాలని సూచించారు.దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చని తెలిపారు. వ్యాయామంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి,కలెక్టర్,అధికారులు ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు,క్రీడాభిమానులతో కలిసి యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు.ఈ కార్యక్రమంలో డిఎం& హెచ్ఓ గోపాల్ రావు,కౌన్సిలర్లు, మెడికల్ కాలేజీ విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి..!






(మొదటి పేజీ తరువాయి...)

రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శుక్రవారం రోజున గీసుగొండ మండలం కొనయమాకుల రైతు వేదికలో జిల్లా కలెక్టర్ సత్య శారద తో కలిసి సంగెం,గీసుగొండ మండలాల పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు ఎమ్మెల్యే మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు,చిన్నారుల సంక్షేమంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని కొనియాడారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా అంగన్వాడీ సేవలు మరింత సమర్థవంతంగా మారుతాయని ఆయన పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో గర్భిణులు,బాలింతలు,చిన్నారుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయడానికి,విధి నిర్వహణలో వేగం పెంచడానికి ఈ మొబైల్ ఫోన్లు దోహదపడతాయన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రజాప్రభుత్వం ప్రధాన లక్ష్యమని,అందుకోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను అమలు చేస్తూ చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని ఆయన వివరించారు.జిల్లా కలెక్టర్ సత్య శారదా మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాల అమలులో,లబ్ధిదారులతో సమన్వయం చేసుకోవడంలో మరియు సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని,అంగన్వాడీ టీచర్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం





(మొదటి పేజీ తరువాయి...)

పనులకు,అంకంపల్లి గ్రామంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఐటిడిఏ నిధులు సుమారు 83 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి అంకంపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.అదేగ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు.పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు.స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి మౌళిక సదుపాయాల కల్పన పలు అంశాలపై అంగన్వాడీ చిన్నారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..జిల్లా అభివృద్ధి పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మారుమూల ప్రాంతాల అభివృద్ధి,గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అంకంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అన్ని మౌలిక వస్తువులు కల్పిస్తూ మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని,గతంలో రోడ్డుసౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కున్నారని ప్రజలకు రవాణా సౌకర్యాలను కల్పించడం కోసం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని తెలిపారు.గూడు లేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో ములుగు నియోజకవర్గానికి 5000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని త్వరలో అర్హులైన అందరికీఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం రెండవ విడతను ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్థానిక ఉత్పత్తులైన ఇప్ప పువ్వు, తేనె సేకరణ వంటి పనులను చేపట్టడం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, మెనూలో ఎటువంటి లోపాలు చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్,ప్రజా ప్రతి నిధులు,చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో పోలీసు కమిషనర్ అధ్యక్షతన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద లతో కలసి అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఆర్ అండ్ బి, రవాణా తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ నెల 13 నుండి 18 వరకు కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు సమర్థంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు, రెవిన్యూ, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హసన్‌పర్తి పరిధిలో ప్రమాదాలు అధికంగా ఉన్నందున జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రమాదంపై విచారణ జరిపి కారణాలను గుర్తించి నివారణ చర్యలు అమలు చేయాలని సూచించారు. రోడ్ల భద్రతా ప్రమాణాలను మెరుగు పరచడం, వాహన దారుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాటు పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ యాజమాన్యాలతో సమావేశాలు, డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇప్పటికే నిర్వహించామని, అవసరమైన వారు కంటి అద్దాలు తప్పని సరిగా వినియోగించాలన్నారు. పోలీస్, సాంస్కృతిక కళా బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతామని తెలిపారు. చివరి రోజున రూల్స్ పాటించిన వారికి ప్రశంస పత్రాలు అంద జేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీఏ ఆధ్వర్యంలో పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగు పరచి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై రోజువారీ కార్య క్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా, మున్సిపల్, గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించేలా పర్యవేక్షణ చేయాలని, అధికారులు కూడా ఆదర్శంగా ఉండాలని సూచించారు. మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలపై దృష్టి పెట్టడంతో పాటు అవసరమైన కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. బ్లాక్‌స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉండాలని, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి కలిసి ముందడుగు వేయాలని అన్నారు. "వివిధ ప్రచార మాధ్యమాలు, కళాజాత కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించినప్పుడే ప్రమాదాలను తగ్గించ గలమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మొత్తం బస్సులలో గణనీయమైన సంఖ్యలో ఫిట్నెస్ తనిఖీలు పూర్తిచేసి, డ్రైవర్లకు ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

మిగిలిన బస్సుల ఫిట్నెస్‌ను త్వరితగతిన పూర్తి చేసి, అన్ని వాహనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై మాట్లాడుతూ, నేషనల్ హైవేపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు అవసరమని తెలిపారు. ప్రమాదాలున్న ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ట్రాఫిక్ నియమాల అమలును కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో డిపిపి లు రాజమహేంద్ర నాయక్, దార కవిత, అంకిత్ కుమార్, ప్రభాకర్ రావు, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, సంధ్యారాణి, వై వి గణేష్, ఆర్ అండ్ బి, రవాణా, రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, సంబంధిత శాఖల జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులు అంకితభావంతో పనిచేయాలి

- గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరుచుకోవాలి
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





**పరకాల ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల, నడికుడ,దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలోని సర్పంచ్ లు అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి కోసం నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలి అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు.ప్రజలతో సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి అని,ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరేలా సమర్థంగా అమలు చేయాలి అన్నారు.అలాగే ఎండాకాలంలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి అని,మిషన్ భగీరథ నీటి సరఫరా,బోరు బావుల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల అరికట్టడం, తదితర చర్యలు చేపట్టాలని అన్నారు.

# తహసీల్దారుకు శుభాకాంక్షలు తెలిపిన దళిత బహుజన నాయకులు



**హసన్‌పర్తి,ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి):** హసన్‌పర్తి తహసీల్దారు కిరణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా దళిత బహుజన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రామచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సందెల చిన్న తహసీల్దారు కార్యాలయంలో కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నిజాయితీ, అంకితభావం, సేవాతత్పరతతో విధులు నిర్వర్తిస్తూ క్రమశిక్షణ కలిగిన అధికారిగా కిరణ్క ుమార్ పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు సకాలంలో సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారని తెలిపారు.ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండి పేద ప్రజలకు మరింత సేవలు అందించాలని, ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యల సాంబరెడ్డి, సదానందం, కందారా అనిల్, ఆదాయ శాఖ అధికారులు ఫాజీల్, రాజేంద్రప్రసాద్, కుమార్, గ్రామ పంచాయతీ అధికారులు ఘనపురం మహేందర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ కడియం కావ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు



**సాయి పేట, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి ):** ఎంపీ కడియం కావ్య పుట్టినరోజు సందర్భంగా సాయి పేట గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ నాగరాజు, ఉపసర్పంచ్ జోగాల రాజేందర్, వార్డు మెంబర్ సోంపల్లి యుగంధర్ కలిసి ఎంపీ కడియం కావ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యకర్తలు వక్కల సుమన్, కేసుజు వెంకన్న పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# పిడిఎస్ బియ్యం పట్టివేత

- టాస్క్ ఫోర్స్ దాడుల్లో 12 క్వింటాళ్లు సీజ్, ఒకరు అరెస్ట్



**పరకాల ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి )** హనుమకొండ జిల్లా పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నాగారం గ్రామంలో దాడులు నిర్వహించిన టాస్క్ ఫోర్స్ బృందం జలిగపు మహేందర్ ఇంటిలో తనిఖీలు చేపట్టింది. తనిఖీల్లో భాగంగా అక్రమంగా నిల్వ ఉంచిన 26 సంచుల పిడిఎస్ బియ్యం (12 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన బియ్యం విలువ సుమారు రూ.42 వేలుగా అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనలో నిందితుడు జలిగపు మహేందర్ ను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న బియ్యం పరకాల పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి పేటలో ఉపాధి హామీ పనులు పరిశీలన

- – కార్మికులకు మజ్జిగ పంపిణీ



**ధర్మసాగర్, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సాయి పేట గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పనులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల ఎంపీడీవో సార్ మరియు టెక్నికల్ అసిస్టెంట్ వీరన్న పరిశీలించారు.గ్రామంలోని చెరువులో మట్టి తీయడం పనిలో సుమారు 100 మంది కార్మికులు పాల్గొన్నారు. పనులు సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయాన్ని అధికారులు పరిశీలించి, కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సాయి పేట గ్రామ సర్పంచ్ లక్ష్మీ నాగరాజు కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసి, ఎండలో పనిచేస్తున్న వారికి ఉపశమనం కల్పించారు. కార్మికులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరియు పంచాయతీ కార్యదర్శి వెంకన్న కూడా పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన విజయవంతానికి అర్చకులతో సమావేశం



**పరకాల, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)** ఈనెల 28న నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి హిందూ సమ్మేళన జాగరణ సమితి ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని చెన్న కేశవ దేవాలయంలో అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ నాగబండి విద్యాసాగర్, అధ్యక్షులు కొలుగూరి రాజేశ్వరరావు, సహ అధ్యక్షుడు మాడుగుల పాపిరెడ్డి రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుప్పటి సాంబా శివుడు, కోశాధికారి సీఏ తిప్పర్తి యుగేందర్ చారి, పావుశెట్టి అనిల్ కుమార్ తదితరులు అర్చకులను కలిసి సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కటూరి రామకృష్ణాచార్యులు ఇతర పూజారులు పాల్గొన్నారు.

# గ్రామ శివారులో క్రషర్ దుమ్ము, బాంబ్ బ్లాస్టింగ్‌తో భయాందోళన

- – రైతుల ఆందోళన

**ధర్మసాగర్, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** ధర్మసాగర్ మండలంలోని గ్రామ శివారులో క్రషర్ కారణంగా పరిసర ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రషర్‌లో రాళ్లను అపుటడం వల్ల ఎగసి పడుతున్న దుమ్ము పక్కనే ఉన్న పొలాలపై పడుతూ పంటలను దెబ్బతీస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా, క్రషర్ మరియు బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా రాళ్లు పొలాల్లోకి ఎగిరి పడుతున్నాయని, దీనివల్ల పంటలకు మరింత నష్టం జరుగుతోందని తెలిపారు.ప్రత్యేకంగా గాలి వీచే సమయంలో ఈ దుమ్ము విస్తరించి పొలాలపై పడుతూ పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని రైతులు చెప్పారు.అదేవిధంగా, రాళ్లు తీయడానికి తరచుగా బాంబ్ బ్లాస్టింగ్ నిర్వహించడం వల్ల భారీ శబ్దాలు వినిపిస్తూ భయాందోళన కలుగుతోందని తెలిపారు. పొలాల పక్కన ఉన్న పౌల్ట్రీ మరియు డెయిరీ ఫార్మ్‌ల యజమానులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు. క్రషర్ కార్యకలాపాలను నియంత్రించాలని, బ్లాస్టింగ్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణానికి, వ్యవసాయానికి హాని కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌పై సమీక్ష సమావేశం



**హనుమకొండ, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి )** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన అంశాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన ముఖ్య వివరాలను సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మెప్మా పీడీ జోనా, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమ కళతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూమి నమోదు చేయాలని వినతి



**చిట్యాల (ప్రజాజ్యోతి )ఏప్రిల్ 10,** మండల కేంద్రానికి చెందిన కండె ఓదెలు గత 20 సంవత్సరాలుగా కైలాపూర్ శివారులోని 86 సర్వే నెంబర్లో ఎకరం భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.సాగు చేసుకుంటున్న భూమిని అతని పేరు మీద పట్టా చేసి కంప్యూటర్ పాణి లో నమోదు చేయాలని సి పి ఐ ఎం ఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదా బై నామాలో తనతో పాటు వున్న 14 మంది పట్టాలు పొందినా ఓదెలు కు మాత్రం పట్టా పొడలేదన్నారు.తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి పట్టా ఇప్పించాలని మల్లేష్ భాధితునితో కలసి తహసిల్దార్ కు వినతిపత్రం అందించారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట సుధాకర్



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మార్చి 10 (ప్రజా జ్యోతి)**జయశంకర్ భూపాలపల్లి జిల్లామహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆకుతోట సుధాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుధిల్ల శ్రీధర్ బాబు కి, పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు కి,మరియు తన నియామకానికి సహకరించిన ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరుణాకర్ కి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు కి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అక్బర్ ఖాన్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

- **: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ ఉద్యోగులు కూడా సామాజిక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కలెక్టరెట్ లో రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య, వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డిఎంహెచ్ఓ మల్లిఖార్జున రావు, డిసిహెచ్ఎస్ నరేందర్ శర్మ , మెడికల్ అధికారులు అన్వర్, దివ్యలతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. ఇది ఎంతో నిస్వార్థమైన, గొప్ప మానవీయ సేవ అని దీని వల్ల ఆరోగ్యవంతులైన వ్యక్తులు చేసే రక్తదానం, ప్రమాదాల్లో, శస్త్రచికిత్సల్లో, తీవ్రమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండెపోటు ప్రమాదం తగ్గుతుందని, శరీరంలో ఐరన్ స్థాయిలు అదుపులో ఉంటాయన్నారు. ఈ రక్త దాన శిబిరంలో వివిధ శాఖల అధికారులు, వారి సిబ్బంది మొత్తం 62 మంది తమ రక్తాన్ని దానం చేశారు. ఈశిబిరాన్ని మెడికల్ అధికారులు, టెక్నీషియన్స్ సజావుగా నిర్వహించి రక్తం దానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ లను అందించారు.




# అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలి

- **పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**
- **అరైవ్ అలైవ్ ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి అడుగులు**
- **బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి--- ప్రమాదాల నివారణే లక్ష్యం**






**హనుమకొండ, ఏప్రిల్ 10(ప్రజా జ్యోతి)**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు.శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఆర్&బి, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేసి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.హసన్‌పర్తి పరిధిలో ప్రమాదాలు అధికంగా ఉన్నందున జాతీయ రహదారులు, ఆర్&బి శాఖలతో సమన్వయం చేసి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ప్రమాదంపై విశ్లేషణ చేసి కారణాలను గుర్తించి నివారణ చర్యలు అమలు చేయాలని సూచించారు.రోడ్ల భద్రతా ప్రమాణాల మెరుగుదల, బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి కంటి అద్దాలు వినియోగం తప్పనిసరి చేయాలని సూచించారు. కళాజాతలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.చివరి రోజున ట్రాఫిక్ నియమాలు పాటించిన వారికి ప్రశంస పత్రాలు అందజేస్తామని తెలిపారు. పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ల అందుబాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రమాదాలున్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, గ్రామ స్థాయి వరకు రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉండాలని తెలిపారు.పాఠశాల బస్సుల ఫిట్నెస్ తనిఖీలు వేగవంతం చేసి విద్యార్థుల భద్రతను నిర్ధారించాలని పేర్కొన్నారు.జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని, జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా ఉన్ననేపథ్యంలో ప్రత్యేక చర్యలు అవసరమని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ ద్వారా నిర్వహించే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ, ఏప్రిల్ 10(ప్రజా జ్యోతి)** యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నావల్ అకాడమీ మరియు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.ఈ నెల 12న నిర్వహించనున్న పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద భద్రత, నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు, ప్రశ్నా పత్రాల రవాణా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు.జిల్లాలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు, పింగిలి ప్రభుత్వ బాలికల కళాశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా, మొత్తం 963 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష మొదటి పేపర్ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. అదేవిధంగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్–1లో మొదటి పేపర్ ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మూడో పేపర్ సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, బీసీ సంక్షేమ అధికారి నరసింహమూర్తి, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పోస్టల్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యోగా ద్వారా శారీరకంగా మానసికంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మార్చి 10 (ప్రజా జ్యోతి)** యోగ సాధన ద్వారా శారీరకంగా మానసికంగా ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, ఆరోగ్య వారోత్సవం మరియు హోమియోపతి డేని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా సెషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా హోమియోపతి వైద్య విధాన పితామహుడు డా. క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యూయెల్ హానెమాన్ గారి 271వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వత్తిడి జయించడానికి యోగా అద్భుతమైన సాధనమని తెలిపారు. ప్రజలు ప్రతిరోజూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుని క్రమం తప్పక సాధన చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండే ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీమతి విజయ లక్ష్మి, మునిసిపల్ చైర్మన్ బుర్ర కొమ్మరయ్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, డిపిఆర్వో శ్రీనివాస్, ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, ఆయుష్ జిల్లా వైద్య బృందం, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, నర్సింగ్ విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలుపై బీజేపీ, బీఆర్ఎస్ వ్యాఖ్యలు హాస్యాస్పదం



**వర్ధన్నపేట, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి.** తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలుపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య సతీమణి, మహిళా నాయకురాలు నరుకుడు ఎలీషా పేర్కొన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం కింద తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు.

విద్యా రంగంలో సంస్కరణలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు 25 రకాల అవసరమైన వస్తువులు, అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. వారానికి మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావా అందించడం జరుగుతోందని చెప్పారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించారని, ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకొస్తోందని, విద్యా రంగంలో మార్పుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఇటీవల అసెంబ్లీలో పేరెంటల్ సపోర్ట్ చట్టం–2026ను తీసుకురావడం ముఖ్యమైన నిర్ణయమని చెప్పారు. తల్లిదండ్రులను పోషించని వారిపై చర్యలు తీసుకునేలా ఈ చట్టం అమలు చేస్తుందని, వృద్ధులు నేరుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లో పరిష్కారం కల్పిస్తుందని తెలిపారు. అవసరమైతే సంపాదనలో 15 శాతం లేదా నెలకు రూ.10,000 వరకు పోషణగా ప్రభుత్వమే వసూలు చేసి తల్లిదండ్రులకు చెల్లిస్తుందని వివరించారు.

వ్యవసాయ రంగంలో రైతులకు మద్దతుగా సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 ప్రోత్సాహకాన్ని అందిస్తున్నారని, మక్కలను రూ.2400 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. దాదాపు 60 వేల ఉద్యోగాలు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

గత పాలకులు 10 సంవత్సరాల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి రాష్ట్ర ఖజానాను దోపిడీ చేశారని ఆరోపించారు. కేంద్రంలో గత 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రతి ఏడాది కోటి ఉద్యోగాలు, జనధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీలను ఎందుకు నెరవేర్చలేదో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలి



(మొదటి పేజీ తరువాయి...)

వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భద్రకాళి చెరువులో తీస్తున్న పూడిక మట్టిని ప్రభుత్వ భూముల్లో క్రమపద్ధతిలో నిల్వ చేయాలని, భూముల పరిరక్షణకు ఇది ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూడిక తీత పనులను మే 15 నాటికి పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అమ్మవారిపేటతో పాటు ఇతర ప్రాంతాలలో పూడిక మట్టిని నిల్వ చేస్తున్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం 7.70 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత పూర్తయిందని, మిగిలిన పనులను వేగవంతం చేసి లక్ష్యాన్ని సమయానికి చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డిఈ మధుసూదన్ రెడ్డి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఏఈ శ్యామ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మా వనరులు మేము ఉపయోగించుకుంటాం. రుసుం ఎందుకు?

**ఏటూర్ నాగారం ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి** నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు కానీ. ఇతర ఇండ్లకు మా వాగులో మేము రుసుం కట్టుకోవడం అంటే "తలాపున సముద్రం పెట్టుకొని కొంగ నీళ్లకు ఏడ్చినట్టుగా" ఉందని కోట్లాది క్యూబిక్ మీటర్లు.లక్షలాది టన్నుల ఇసుక మా గోదావరి నుండి తరలించుకుపోయేదె కాక ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి సొంతింటి కల నెరవేర్చేది పోయి నానా కష్టాలు పడి కూలి పని చేసుకుని పైసా పైసా పోగేసుకొని వడ్డీలు తెచ్చుకొని ఇల్లు నిర్మించుకొంటుంటే "ములిగెనక్కపై తాటిపండు పడ్డట్టు" ప్రభుత్వం ప్రజాపాలన అంటూ మరొకవైపు ప్రజలపై ఈ వడ్డింపులు ఏంటని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి దావూద్ దుయ్య పట్టారు. గత ప్రభుత్వంలో కూడా ఇదే విధంగా డీడీలు తీయాలి అని మొండి కేస్తే ధర్నాలు చేసి అధికారులతో చర్చిస్తే డిడి విధానం నిలిపివేశారని అదేవిధంగా ఈ పద్ధతి ఎందుకు పెడుతున్నారంటే కొంతమంది దొంగలు ట్రాక్టర్లతో డంపు చేసి లారీల్లో లోడ్ చేసి దొంగ రవాణా చేస్తున్నారని చెప్తున్నారని అలాంటి దొంగల్ని పట్టుకోలేక పోతే కొంతమంది ప్రజలు సమాచారం ఇచ్చిన కొంతమంది అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తూ చూసి చూడనట్టు. విని వినట్లు నటించి ఇలాంటి దొంగలపై చర్యలు తీసుకోలేదంటే అందులో వారికి కూడా వాటా ఉందేమో అని అనుమానించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే మా వనరులు మేము మా మండల ప్రజలు ఉపయోగించుకునేలా అవకాశం కల్పించి ఆదుకోవాలని లేదంటే పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిఎల్ రవి. తోలెం కృష్ణయ్య. వడకాపురం సారయ్య. ఎస్కే పత్తి మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



**ప్రజాజ్యోతి –మొగుళ్ళపల్లి (ఏప్రిల్ 10)** మండలకేంద్రంలోని పెద్ద వాగు బ్రిడ్జి వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్.ఐ ముప్పు సురేష్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాలు తనిఖీలు నిర్వహించగా వాహన తనిఖీల సమయంలో మిర్యాల భాస్కర్ (30) అనే నిందితుడిని అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించినట్లు చిట్యాల సి ఐ మల్లేష్ యాదవ్,ఎస్సై తెలిపారు.సి ఐ తెలిపిన వివరాల ప్రకారం పలివేల్పుల భీమారంకు చెందిన మీర్యాల భాస్కర్ కూలీ పనులు చేసుకుంటూ సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గత నెల (మార్చి 29) న మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో గ్యాస్ స్టవ్ రిపేర్ పేరుతో ఇంటిలోకి ప్రవేశించి రూ.15,000/– నగదు దొంగతనం చేసినట్లు తెలిపారు. వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల్లో ఇదే తరహాలో పలుమార్లు దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు ఇప్పట్టి వరకు 30 కి పైగా దొంగతనం కేస్ లో నిందితుడుగా ఉన్నాడని నిందితుడి వద్ద నుండి మొత్తం రూ.48,820/– నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో రూ.15,000/– ఇప్పలపల్లి గ్రామ దొంగతనానికి సంబంధించినది కాగా, మిగిలిన మొత్తం ఇతర ప్రాంతాల్లో జరిగిన దొంగతనాలకు చెందినదిగా గుర్తించామని అదనంగా ఒక బైక్, బంగారం వెండి ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.స్వాధీనం చేసిన నగదు, ఆభరణాలను సీజ్ చేసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.అపరిచిత వ్యక్తులను ఇంటిలోకి అనుమతించే ముందు వారి వివరాలు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సి ఐ కోరారు.

## స్నేహితుడు లేకపోయినా... అతని పిల్లల కోసం అండగా నిలిచిన పదవ తరగతి మిత్రులు

- రోడ్డు ప్రమాదం లో మిత్రుడు రమేష్ మృతి
- రమేష్ పిల్లల భవిష్యత్తుకు ₹45,000 ఫిక్స్డ్ డిపాజిట్... స్నేహబలం చూపించిన పదవ తరగతి మిత్రులు



**తరిగొప్పుల ఏప్రిల్ 10 ప్రజాజ్యోతి :** తరిగొప్పుల గ్రామానికి చెందిన చిలువేరు రమేష్ గత వారం రోజుల క్రితం హఠాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషాద వార్త తెలుసుకున్న అతని తోటి స్నేహితులు, 10వ తరగతి 2009–2010 సభ్యులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. రమేష్‌కు ఇద్దరు చిన్న పాపలు ఉన్నారని తెలిసి, వారి భవిష్యత్తు కోసం ముందుకు వచ్చిన స్నేహితులు ఆపదలో స్నేహితులు అనే భావనతో 45,000 రూపాయలను పిల్లల పేర్లపై ఫిక్స్డ్ డిపాజిట్ చేయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం స్నేహితుల మధ్య ఉన్న అనుబంధానికి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, "ఈ కష్ట సమయంలో మా కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మా పిల్లల భవిష్యత్తు కోసం మీరు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోలేము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదునూరి కరుణాకర్, సురేష్, రవి, శ్రీధర్, కనకరాజు, రాజు, కళింగ రాజు, అనిల్, చింతల అశ్విని, రేణుక, హేమలత, రమ్య, మౌనిక, భూలక్ష్మి, లక్ష్మీ దుర్గ, గాయని భవాని తదితరులు పాల్గొన్నారు. రమేష్ కుటుంబానికి తమవంతు సహాయం అందిస్తూ, పిల్లల భవిష్యత్తు కోసం ముందడుగు వేయడం పట్ల స్థానికులు అభినందిస్తున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్ నగదు ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం



**జనగామ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి ):** జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ఏరియాలో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు జనగామ సిఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ లు భరత్, రతీష్, నర్సయ్య, కానిస్టేబుల్లు భాస్కర్, శ్రీకాంత్, రాజేష్ లతో రైడ్ చేయగా 5 గురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 14,070 రూపాయలు నగదు, 5 మొబైల్ ఫోన్లు, 104 పేక ముక్కలను స్వాదిన పర్చుకొని వారి పై కేసు నమోదు చేసినట్లు సిఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

## అశ్రఫ్ అకాల మరణం బాధాకరం..మహబూబ్ పాషాకు ఉద్యమకారుల ధైర్యం..!



**సంగెం,ఏప్రిల్10(ప్రజాజ్యోతి):** మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా ప్రతినిధి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(TUF)మండల వైస్ ప్రెసిడెంట్ ఎండి.మహబూబ్ పాషా-నజీమ దంపతుల పెద్ద కుమారుడు ఎండి.అశ్రఫ్(24)అకాల మరణం పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.అనారోగ్యంతో ఈ నెల 6వ తేదీన అశ్రఫ్ మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు రాజకీయ ప్రముఖులు శుక్రవారం గవిచర్ల గ్రామంలోని వారి నివాసానికి చేరుకున్నారు.మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పుత్రశోకంతో ఉన్న మహబూబ్ పాషా కుటుంబ సభ్యులను ఓదార్చి,వారికి ధైర్యం చెప్పారు.పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు మైపాల్ రెడ్డి,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు మండల అధ్యక్షులు కౌడగాని శంకర్రావు(వంజరపల్లి),ఉద్యమకారుల ఫోరం నాయకులు మెరుగు నరసయ్య(షాపురం), మొండ్రాయి గ్రామానికి చెందిన ఉద్యమకారులు,మండల నాయకులు పాల్గొన్నారు.చిన్న వయసులోనే అశ్రఫ్ మరణించడం ఆ కుటుంబానికి తీరని లోటని,ఈ కష్టకాలంలో వారు ధైర్యంగా ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.

## కుంటపల్లి గ్రామ కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు సన్మానం..!



**సంగెం,ఏప్రిల్10(ప్రజాజ్యోతి):** మండలంలోని కుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బదిలీ పై వెళుతున్న పంచాయతీ కార్యదర్శికి గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.కుంటపల్లి గ్రామం నుండి గీసుగొండ మండలం మనుగొండకు బదిలీ అయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెంతల సువర్ణ మాట్లాడుతూ..కార్యదర్శి వాజీద్ తమ గ్రామంలో పని చేసిన కాలంలో అభివృద్ధి పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మరియు గ్రామ సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.అనంతరం కార్యదర్శిని శాలువాతో సత్కరించి,పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేశారు.అదేవిధంగా కార్యదర్శి వాజిద్ మాట్లాడుతూ..కుంటపల్లి గ్రామస్తులు ప్రజాప్రతినిధులు తనకు అందించిన సహకారం మరువలేనిదని,ఇక్కడ పనిచేయడం సంతృప్తిని ఇచ్చిందని భావోద్వేగంతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,ఆయా పార్టీల నాయకులు,పంచాయతీ సిబ్బంది,యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో ఘనంగా అన్యువల్ డే సెలబ్రేషన్స్



**జనగాం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** జనగాం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆన్యువల్ డే సెలబ్రేషన్స్ ను కాలేజీ యాజమాన్యం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ మాజీ మార్కెట్ చైర్మన్, ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ చైర్మన్ బాలేదే సిద్ధిలింగం, కాలేజీ కరస్పాండెంట్ చంద్రగిరి స్వామి, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి. సీతారాం, కాలేజీ డైరెక్టర్స్ స్టాఫ్ పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో, సంప్రదాయం నృత్యాలతో అలరించారు.

# భార్య, ఇద్దరు పిల్లలు హత్య కేసును చేదించిన పోలీసులు

- **భర్తతో పాటు 10 మంది అరెస్ట్. ఇద్దరు పరారీ.**



**వర్ధన్నపేట/ఐనవోలు ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన భార్య, ఇద్దరు పిల్లలు హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు భర్తతో పాటు మొత్తం 10 మందిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఐనవోలు మండలం, పున్నేలు గ్రామానికి చెందిన ఎం.డి. అజారుద్దీన్ (29) తన భార్య ఫరహాత్‌ను 2016లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి హుమేరా (9), ఆయేషా (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, కుమారుడు పుట్టాలనే ఆకాంక్షతో అజారుద్దీన్ కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చినట్లు వెల్లడైంది. ఈ క్రమంలో 2021, 2022 సంవత్సరాల్లో ఫరహాత్ గర్భం దాల్చినప్పుడు, పుట్టబోయేది ఆడ శిశువేనన్న అపనమ్మకంతో బలవంతంగా గర్భస్రావాలు చేయించినట్లు విచారణలో తేలింది. ఇందుకు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సు మరియు ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇదే సమయంలో, నిందితుడు ఓ మైనర్ బాలికను ప్రేమించడంతో, ఆమెను వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో భార్య, పిల్లలు అడ్డంకిగా భావించినట్లు గుర్తించారు. దీంతో వారిని హత్య చేయాలని పన్నాగం పన్నిన అజారుద్దీన్, ఈ నెల 1వ తేదీ రాత్రి "ఐస్‌క్రీం తినిపిస్తాను" అంటూ తన భార్య, పిల్లలను స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లాడు. ముందుగానే సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా నిలిపివేసిన నిందితుడు, స్విమ్మింగ్ పూల్ వద్ద వారిని బలవంతంగా నీటిలోకి నెట్టివేసి, మునిగిపోయే వరకు పట్టుకుని దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ప్రచారం చేసినట్లు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాల సహాయంతో విచారణ జరిపిన పోలీసులు, అజారుద్దీన్ నేరాన్ని నిర్ధారించారు. ప్రత్యేక బృందాల సహాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అజారుద్దీన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు మరియు సహకరించిన మరో తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న డా. పూర్ణిమ, డా. రవళి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, గీసుగొండ ఇన్స్‌పెక్టర్ విశ్వేశ్వర్, మామూనూర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఐనవోలు ఎస్ఐలు మరియు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ఆటో డ్రైవర్ నూతన కార్యవర్గం ఎన్నిక





**ఖానాపురం/ఏప్రిల్ 10(ప్రజా జ్యోతి)** ఖానాపురం మండలం న్యూ గణేష్ ఆటో డ్రైవర్ యూనియన్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు రంగు కుమార్ స్వామి గౌడ్, కార్యదర్శి కందిక రాంబాబు, ఉపాధ్యక్షుడు గమడత బిక్షపతి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా మర్రి సురేష్, బొమ్మిర అశోక్, బీమగాని సురేష్,కామిశెట్టి గాంధీ,కొయ్యల అనిల్,మహమ్మద్ అజీజ్ పాషా, చీకటి ప్రభాకర్,అనుముల రాజు, కోడూరి సంబరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రంగు కుమార్ స్వామి గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి తనకు అప్పజెప్పిన బాధ్యత సక్రమంగా నిర్వహిస్తూ, సంఘ పురోగతి కోసం పాటుపడుతున్నారు. ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తాననని తెలిపారు.

## రూ.500 కోసం పంచాయతీ: వ్యక్తిపై కర్ర తో దాడి

**చెన్నారావుపేట ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)** కేవలం ఐదు వందల రూపాయల విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి ఒకరి తల పగిలిన ఘటన చెన్నారావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రంలోని అక్కల్చెడ హర్య తండాకు చెందిన మూడు రాజు అనే వ్యక్తికి, అదే గ్రామానికి చెందిన గుగులోతు భాను ప్రసాద్ రూ.500 ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన రాజు తన డబ్బులు ఇవ్వాలని భాను ప్రసాద్‌కు ఫోన్ చేసి కోరాడు. దీనికి సమాధానంగా భాను ప్రసాద్.. డబ్బులు ఇస్తానని, గ్రామ రచ్చబండ వద్దకు రావాలని రాజును నమ్మబలికాడు.రాజు అక్కడికి చేరుకోగానే, ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో ఆగ్రహానికి లోనైన భాను ప్రసాద్ కర్రతో రాజు తలపై బలంగా కొట్టాడు.ఈ దాడిలో రాజు తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. బాధితుడు మూడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఫాదర్ కొలంబో స్కూల్లో గ్రాడ్యుయేషన్ అండ్ అవార్డు వేడుక




**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):** స్టేషన్ ఘనపూర్ లోని ఫాదర్ కొలంబో స్కూల్ లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ అండ్ అవార్డు వేడుకలను ఎంతో ఘనంగా ఉత్సాహంగా, ఆనందంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవ. ఫా. విజయ్ పాల్ రెడ్డి, మరో ముఖ్య అతిథిగా తాటికొండ వినయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ లు విచ్చేయగా ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. ఫా. థామస్ కిరణ్ అధ్యక్షత వహించగా రెవ. ఫా. అగస్టిన్ రెడ్డి పాల్గొని వేడుకకు మరింత శోభను చేకూర్చారు. ఈ కార్యక్రమం అర్థవంతమైన రంగురంగుల సాంస్కృతిక నృత్యాలతో నిండి, అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరై ఈ వేడుకను మరింత వైభవంగా మార్చారు. చిన్నారులకు వారి విజయాలను గుర్తిస్తూ పట్టాలు ప్రదానం చేయడంతో పాటు, విద్యా సహ పాఠ్య కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన అతిథులు మరియు తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మర్యాదపూర్వకముగా తాసిల్దారును కలిసిన బుద్దారం సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 10** గణపురం మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన గణపురం తహసిల్దార్ అడ్లూరి రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన బుద్దారం గ్రామ సర్పంచ్ విడిదినే శ్రీలత అశోక్ ఉప సర్పంచ్ మారవేణి ఐలయ్య అనంతరం గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలు రైతుల భూమిల సమస్యలకు సహకరించవలసిందిగా తహసిల్దారు ను కోరారు వారి వెంట మాజీ వైస్ ఎంపిపి విడిదినేని అశోక్ వున్నారు

# అక్రమ అరెస్టులతో ముదిరాజుల ఉద్యమాన్ని ఆపలేరు

- ముదిరాజ్ లను బీసీ డి నుండి బీసీ ఎ లోనికి మారుస్తా అని ఇచ్చిన హామీని సిఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలి
- ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)** నర్సంపేట నుండి రాష్ట్ర ముదిరాజ్ సంఘం పిలుపు మేరకు హాలో ముదిరాజ్ ఛలో గాంధీభవన్ ముట్టడికి శుక్రవారం రోజున హైదరాబాద్ కు వెళ్తున్న క్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, వరంగల్ జిల్లా ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తో పాటు ముదిరాజ్ సంఘం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ముదిరాజ్ సంఘం పిలుపు మేరకు హాలో ముదిరాజ్ ఛలో హైదరాబాద్ గాంధీభవన్ ముట్టడికి వెళ్తున్న ముదిరాజ్ నాయకులను పోలీసులు అరెస్టు కాంగ్రెస్ పార్టీ గత మూడు సంవత్సరాల క్రితం ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో బీసీ డెకరేషన్ లో భాగంగా ముదిరాజులకు బీసీ డీ నుండి బీసీ ఎ లోకి మారుస్తానని మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ముదిరాజులకు ఇచ్చిన హామీల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగానే శుక్రవారం చలో గాంధీభవన్ ముట్టడిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ పోలీసులచే అరెస్టు చేయించి నిర్బంధించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. సిగ్గు చేటు అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముదురాజులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ముదిరాజ్ సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముదిరాజ్ సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించిన అనంతరం తమ సొంత పూచీకత్తుపై విడుదల చేశారని తెలిపారు. అరెస్టు అయిన వారిలో ముదిరాజ్ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, పట్టణ స్నేహ నగర్ అధ్యక్షుడు బోళ్ల స్వామి ముదిరాజ్, పట్టణ కార్యదర్శి మంద మల్లేశం ముదిరాజ్, దుగ్గొండి మండల నాయకులు, మహ్మదాపురం గ్రామ మత్స్య శాఖ అధ్యక్షుడు మంద బిక్షపతి ముదిరాజ్, నర్సంపేట మండల కార్యదర్శి మారపాక రమేష్ ముదిరాజ్, దుగ్గొండి మండల నాయకులు నకిరబోయిన రమేష్ముదిరాజ్, నర్సంపేట పట్టణ కమిటీ సభ్యులు జవ్వాజి సురేష్ముదిరాజ్ లు ఉన్నారు.

## ఆరోగ్యమే లక్ష్యంగా యోగాతో ముందడుగు



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి) :** 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద అయిదో రోజు హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు అందరితో యోగా సాధన చేయించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆయుష్ విధానాలు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని చెప్పారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడానికి ఈ తరహా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని డీఎంహెచ్ఓ తెలిపారు. యోగా ద్వారా శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చన్నారు. యోగా సాధనలో ఆసనాలు శరీర భంగిమలు, ప్రాణాయామం, శ్వాస వ్యాయామాలు, ధ్యానం, వంటి అంశాలు ఉంటాయని, నిత్యం యోగా చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని, నిద్ర మెరుగుపడుతుందని, అలాగే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను నియంత్రించడంలో కూడా యోగా ఉపయోగపడుతుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ వివరించారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం కేటాయించి యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని స్పష్టం చేశారు. ఈ యోగా కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఆయుష్ వైద్యాధికారులు, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పంచాయతీ దిశగా అడుగులు

- డ్రైనేజీ, ఇంకుడు గుంతలపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి
- గ్రామాభివృద్ధికి శ్రీకారం
- డ్రైనేజీ, కల్వర్టుల పరిశీలనలో సర్పంచ్ శ్రీలత
- ఏటూరునాగారంలో సర్పంచ్ పర్యటన



**ఏటూరునాగారం, ఏప్రిల్ 10ప్రజా జ్యోతి** గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు 1, 2 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ వ్యవస్థ, కల్వర్టులు . ఇంకుడు గుంతలను పరిశీలించారు.దెబ్బతిన్న కల్వర్టులను వెంటనే మరమ్మతు చేయాలని, డ్రైనేజీ కాలువల్లో పూడిక తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ ఇంకుడు గుంతల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ చర్యల ద్వారా గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి ప్రాంతంలో నేడు విద్యుత్ నిలిపివేత

**పర్వతగిరి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)**పర్వతగిరి సబ్ స్టేషన్లో నిర్వహిస్తున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా నేడు ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ నేపథ్యంలో పర్వతగిరి, సీకే తండా, ఇస్లావత్ తండా, దౌలత్ నగర్, దేవీలాల్ తండా గ్రామాలు ప్రభావితమవుతాయి. అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసే వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఏడిఈ తిరుపతి కోరారు.

## వేసవిలో నీటి కొరత లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- -మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్



**నర్సంపేట ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి )** మున్సిపల్ యంత్రాంగంతో 19వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండం శ్రీలక్ష్మి రామానంద్ స్థానిక వార్డు కౌన్సిలర్ ఎలుకంటి విజయ్ ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను, మంచినీటి, డ్రైనేజ్,పారిశుద్ధ వ్యవస్థను పర్యవేక్షించి..అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూమున్సిపల్ సిబ్బంది సైడ్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను రోడ్డుకి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని,పారిశుద్ధం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.19వ వార్డులో నీటి సౌకర్యాన్ని పరిశీలించి..ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో బోర్లు వేయించడం జరిగిందని వాటికి మోటర్లు కూడా అమర్చడంజరిగిందని..వేసవికాలంలో వార్డులోని ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా ఇబ్బందుల తలెత్తకుండా చూస్తామని సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు.అదేవిధంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే ఆహార నాణ్యత,వంట గదుల శుభ్రత తాగునీటి సౌకర్యాలను వారు పర్యవేక్షించారు.పిల్లలకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పౌష్టికాహారం,స్వచ్ఛమైన నీటిని అందించాలని పారిశుధ్యం లోపించకూడదని అంగన్వాడి సిబ్బందికి సూచించారు.పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం మరియు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే తమ లక్ష్యం అని తెలిపారు.నర్సంపేట మున్సిపాలిటీలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణంలోని ప్రతి వార్డులోనీ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, పారదర్శక పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 20వ కౌన్సిలర్ శ్రీరామోజు రోజా రాణి,మున్సిపల్ అధికారులు,వార్డ్ ఆఫీసర్,వార్డు జవాన్,మున్సిపల్ సిబ్బంది,19వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ,రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి సంయుక్త సర్వే నిర్వహించాలి

- భూ సరిహద్దుల నిర్ధారణలో స్పష్టత తీసుకురావాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మార్చి 10 (ప్రజా జ్యోతి )**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ అటవీ మరియు రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో సంయుక్త సర్వే నిర్వహించాలని భూముల సరిహద్దుల నిర్ధారణలో స్పష్టత తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శుక్రవారం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాటారం డివిజన్ రెవెన్యూ, అటవీ, బుల్క్ భూ సమస్యలపై రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో కలిసి మండల వారిగా రెవెన్యూ, అటవీ భూ సమస్యలు, బుల్క్ భూ సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా సమస్యలను పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశించారు.భూ సంబంధిత పెండింగ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి కేసును పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎఫ్డిఓ సంపత్, కాటారం డివిజన్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు



**ఏటూర్ నాగారం ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. కోయగూడెం ఏలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందిన తోట నరసయ్య ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్న విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు.జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు మృతుని ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మణ్ బాబు తరపున బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం మరియు రూ.2,500 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా లక్ష్మణ్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. నిరుపేదలకు, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలుస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోరిక సరిత శ్రీను, ఉప సర్పంచ్, పార్టీ నాయకులు గార ఆనంద్, గార రమేష్, ఓజ్జల శివ, కొప్పుల సాయి బాబు, సనుగొండ రమేష్, నర్సింహారావు, నైనారపు జగదీష్, పెనుమచ్చ రమేష్, తోట నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## జలమే జనం జలమే ధనం

- నందిగామ కూడలి లో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్




**నల్లబెల్లి, ఏప్రిల్ 10(ప్రజా జ్యోతి ):** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, గ్రామానికి వచ్చే ప్రయాణికులు స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలం లోని నందిగామ గ్రామ చౌరస్తాలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ భూక్య భాస్కర్ ఈ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎండలు మండిపోతున్న తరుణంలో ప్రయాణికులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వద్దిరాజు. గ్రామ పార్టీ అధ్యక్షులు జంగిలి మోహన్.వార్డు సభ్యులు గాజులపాటి రవి, దూడల రమేష్, ఇస్లావత్ శంకర్, భూక్య సుజాత, అడ్డ శ్రీదేవి, డుకిరె గోపాల్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.గ్రామ కూడలిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

## మాజీ జెడ్పిటిసి వంగాల యాకమ్మ దశదిన కర్మలు పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు



**రాయపర్తి ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కోలన్ పల్లి గ్రామంలో రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ వంగళ యాకమ్మ ఇటీవల మరణించగా, శుక్రవారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళ్లు అర్పించిన రాయపర్తి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్ మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఆశ్రఫ్ పాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అక్రమంగా దత్తత తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు

- పరిరక్షణ అధికారి నన్నెబోయిన హరికృష్ణ




**మంగపేట ఏప్రిల్ 10 ప్రజాజ్యోతి:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (99 రోజుల) ప్రత్యేక కార్యాచరణలో భాగంగా శుక్రవారం మంగపేట మండల కేంద్రం లోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల పరిధిలోని విఏఓ లు మరియు మండల సభ్యులకు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ, విధానాలు, అక్రమ దత్తత మరియు దాని పర్యవసానాలు" అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఐకేపి ఏపిఎం సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరిరక్షణ అధికారి నన్నెబోయిన హరికృష్ణ మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తత అనేది ఎంతో సంతోషకరం అని, అక్రమ దత్తత అనేది ఏనాటికైనా ఆందోళనకరం అని అన్నారు.అక్రమంగా దత్తత తీసుకుంటే బాధ్యులు ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని అన్నారు. అక్రమంగా, దొంగ చాటుగా దత్తత తీసుకోవడం లేదా శిశువు అమ్మకం లేదా కొనుగోలు చేయడం వలన ఆ శిశువు పై దత్తత తీసుకున్న తల్లి తండ్రులకు ఎలాంటి చట్టపరమైన హక్కులు ఉండవని అన్నారు. పైగా అలా చట్ట విరుద్ధంగా దత్తత తీసుకున్న వారు చట్టానికి లోబడి శిక్షార్హులు అవుతారని అన్నారు. ఈ సమాజంలో అక్రమ దత్తత లను అరికట్టడం లో భాగంగా విఏఓ లు మరియు మండల సమాఖ్య సభ్యులు తమ సర్వే పరిధిలో ఎంత మంది అధిక సంతానం కలిగిన గర్భవతులు నమోదు అవుతున్నారు, ఎంత మంది వివాహం జరిగి సంతానం లేకుండా ఉంటున్నారు అనే విషయాలను గుర్తించి డిసిపియు అధికారులకు సమర్పించిన యెడల బాధ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఈ అక్రమ దత్తతను నివారించడం సులువు అవుతుందని సూచించారు. చట్ట ప్రకారం దత్తత ప్రక్రియ వల్ల సమాజంలో పిల్లలు లేని దంపతులు హాయిగా మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదించవచ్చని తెలిపారు. అలా కాకుండా ఎవరైనా శిశువులను అమ్మినా లేదా కొన్నా దానికి 5 సం.ల జైలు శిక్ష మరియు 1 లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఎవ్వరైనా ఇలా కాకుండా పిల్లలు లేనివారు పిల్లలని పెంచుకుందాం అని తీసుకుంటే అది కూడా అక్రమ దత్తత కిందకే వస్తుందని, దీనికి 3 సం.ల జైలు శిక్ష మరియు 1 లక్ష రూపాయల జరిమానా విధించి జరుగుతుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా దత్తత తీసుకొని ఇబ్బందులు బదులుగా చట్టపరంగా ఆన్ లైన్ విధానంలో రూపొందించబడి, పారదర్శకమైన పద్ధతిలో ఢిల్లీ స్థాయి నుండి పనిచేస్తున్న మిషన్ వాత్సల్య అనే పోర్టల్ ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుండైనా దత్తత కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దత్తతకు కావాల్సిన పత్రాలు, దత్తత ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సవివరంగా తెలిపారు. అక్రమ దత్తత లేదా శిశువుల అక్రమ అమ్మకం లేదా కొనుగోలు గురించి సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ 1098 కి కాల్ చేసి అందించవచ్చని, కాల్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు, విఏఓ లు లు మరియు ఐకేపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారం చేసిన యువకులను కఠినంగా శిక్షించాలి

- రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్




**రాయపర్తి ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి** ప్రేమ పేరుతో నయా వంచనకు గురి చేసి గ్యాంగ్ రేపు కు పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలి.సభ్య సమాజం తలదించుకునేలా రాయపర్తి మండలం ఏకే తండాకు చెందిన యువతిని గంజాయి మత్తులో గ్యాంగ్ రేపు చేసిన యువకులను ఉరి శిక్ష వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.యువతికి రక్త స్రావం తీవ్రంగా జరిగినట్లు ఉండడం.. పక్కనే మొక్కజొన్న చేన్లో అత్యాచారం జరిగినటువంటి ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు .గిరిజన యువతికి జరిగిన తీవ్ర అన్యాయం అని, గిరిజన జాతి మహిళలు బయట తిరగాలంటే భయ భ్రాంతులకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.గంజాయి మత్తులో తిరుగుతున్న వారి వల్లే ఈ పరిస్థితి అన్నారు. ఈ ఘటన తీవ్ర విచారకరం అన్నారు.రేప్ చేసిన యువకులను వారి వెంట ఎంత పెద్ద మనుషులు ఉన్నా కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రాయపర్తి మండలంలో గంజాయి సరఫరా చేసే యువకులను అడ్డుకట్ట వేయడంలో స్థానిక అధికార యంత్రాంగంవిఫలమైందన్నారు.గంజాయి విక్రయాలు అడ్డుకొని ఉంటే గిరిజన యువతికి అన్యాయం జరిగేది కాదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఆ కుటుంబానికి న్యాయం జరగకపోతే మండలంలోని గిరిజన సంఘాలతోని రాస్తారోకో, ధర్నాలు చేస్తామన్నారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందించవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు.ఆ కుటుంబానికి న్యాయం కనుక జరగకుండా ఉంటే త్వరలో రాష్ట్రంలో గిరిజన సంఘాలతోని ఎస్టీ యూనియన్ నేతలతోని ఆ యువతి తరపున పోరాటం చేస్తామన్నారు.

## ఆదివాసీ హక్కుల కోసం సంఘటిత పోరాటం అవసరం

- తుడుందెబ్బ ఏటూరునాగారం మండల నూతన కమిటీ ఎన్నికకు పిలుపు

**ఏటూరునాగారం, ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి** ఆదివాసీ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఐటిడిఏ కార్యాలయ ఆవరణలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ములుగు డివిజన్ అధ్యక్షుడు పోడెం శోభన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తుడుందెబ్బ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొరగట్ల లక్ష్మణ్ రావు, జిల్లా అధ్యక్షుడు నల్లెబోయిన లక్ష్మణ్ దొర హాజరై మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఆదివాసీలకు సంబంధించిన జీఓలు, చట్టాలు అమలు కావాలంటే సంఘటిత పోరాటం తప్పనిసరి అని పేర్కొన్నారు.ఏటూరునాగారం మండలంలోని 12 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మండల నూతన కమిటీ ఎన్నికలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రతినిధి కోరేం మొగిలి, జిల్లా ప్రసార కార్యదర్శి సోయం ఈశ్వరయ్య, యాలం దేవేందర్, జిల్లా నాయకుడు నరేష్ పాల్గొన్నారు.



## మండల స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

**చెన్నారావుపేట ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి )** చెన్నారావుపేట మండల స్థాయి టి టెన్ క్రీడోత్సవాలు క్రీస్తు శేషులు బర్ల దేవాదాస్ జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు బర్ల శ్రీకాంత్ ఆర్థిక సౌజన్యంతో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన క్రీడోత్సవాలను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. జోజిపేట కు సిద్ధార్థ హై స్కూల్ వారికి జరుగుతున్న జట్లకు ట్రాస్ వెయ్యగా జోజిపేట వారు ట్రాసు గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా ఎమ్మెల్యే దొంతి సిద్ధార్థ హై స్కూల్ వారు వేసిన బౌలింగ్ కి బ్యాటింగ్ చేశారు. అనంతరం దొంతి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఆరోగ్యానికి దోహద పడతాయని అంతేకాకుండా ఈ పోటీ ప్రపంచంలో పోటీపడుతూ బ్రతకడం ఎలా అనేది క్రీడలతో యువత నేర్చుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆబిద్ అలీ, గ్రామ సర్పంచ్ కంది శ్వేతా కృష్ణ చైతన్య రెడ్డి, ఆర్ ఐ రషీద్, గ్రామంలోని యువత పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎక్స్ పోజర్ విజిట్ లో కోట గుళ్ళను సందర్శించిన 800 మంది ఎంజెపి విద్యార్థులు

- ఆలయ విశిష్టతను వివరించిన ఉపాధ్యాయులు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 10** ఎక్స్ పోజర్ విజిట్ లో భాగంగా కోట గుళ్ళను హనుమకొండ జిల్లా కమలాపురం పిఎం శ్రీ ఎంజెపి బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఆద్యంతం శిల్పకళా సౌందర్యంతో ఆకట్టుకునేలా ఉన్న ఆకృతులు, శిల్పకట్టడాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు చూపించారు.గురుకుల విద్యార్థుల సందర్శనతో కోట గుళ్ళలో సందడి కనిపించింది. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాంప్రదాయబద్ధంగా విద్యార్థులందరికీ స్వామివారి దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు, అర్చనలు, చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ తాడూరి రవీందర్, ఉపాధ్యాయులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయ ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రం శివనామస్మరణతో మార్మోగించారు. కోటగుళ్ల అందాలను తమ కెమెరాల్లో చిత్రీకరించుకున్నా రు. సామూహికంగా ఫోటోలతో సందడి చేశారు. 800 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి రావడంతో ఆలయానికి కొత్త శోభసంతరించుకుంది.

## గిరిజన యువతి అత్యాచారం–మృతి ఘటనపై నిజాలు వెలికితీయాలి.

- డా. వన్నాల వెంకటరమణ.



**వర్ధన్నపేట ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి.** రాయపర్తి మండలం ఏకే తండాలో గిరిజన యువతి గుగులోతు మహేశ్వరి పై జరిగిన సామూహిక అత్యాచారం మరియు అనుమానాస్పద మృతి ఘటనపై పారదర్శకంగా, సమగ్రంగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఇల్లంద గ్రామంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ దారుణ ఘటన సమాజాన్ని కలచివేసిందని, ముఖ్యంగా గిరిజన మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాయపర్తి మండలం ఏకే తండాలోనే ఇలాంటి ఘటన జరగడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో కొంతమంది యువకులు గంజాయి వంటి మాదకద్రవ్యాల మత్తులో ఈ దారుణానికి పాల్పడినట్టు సమాచారం వెలువడుతున్నదని, రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి సంఘటనలు పెరుగుతున్నాయని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నివారణకు పోలీసు శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. నిందితులపై ఎలాంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లు లేకుండా నిష్పాక్షిక విచారణ జరిపి, త్వరితగతిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, కార్యదర్శి రాయపూరపు కుమారస్వామి, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు నాంపల్లి యాకయ్య, మాజీ టౌన్ అధ్యక్షులు పెద్దూరి రాజ్ కుమార్, జిల్లా ఎస్టీ మోర్చా నాయకులు తేజ నాయక్, ఇల్లంద శక్తి కేంద్రం ఇంచార్జి సట్ల అనిల్, వార్డు సభ్యులు జోగులా సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 10** గణపురం మండల కేంద్రానికి చెందిన పెండ్యాల తిరుపతి ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా పీఎం శ్రీ మోడల్ కళాశాల పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం తిరుపతి కుమారుడు మహీధర్ కు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మహిధర్ మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం ముందుకు వచ్చి వారి కుటుంబానికి అండగా నిలిచారు.

## నగరంపల్లి అంగన్ వాడి 2వ సెంటర్ లో పోషణ అవగాహన కార్యక్రమం

- సాముహిక శ్రీమంతాలు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 10** గణపురం మండలంలోని నగరంపల్లి అంగన్వాడి రెండవ సెంటర్ 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పోషణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 9 నుండి 23వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కొడారి హైమావతి ధనుంజయ యాదవ్ , ఉపసర్పంచ్ దంసాని శ్రీకాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే పోషకాహారాన్ని వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సరైన పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మి , , అంగన్వాడి టీచర్లు ముప్పిడి నీరజ, కరుణ, అనూష,కోమల , విజయ, ఆశా వర్కర్లు సరిత, గుండం సుజాత , ఆరోగ్య సిబ్బంది కళావతి అంగన్వాడి ఆయాలు బండారి రాధా, శ్రీ పెల్లి పద్మ, భూక్య అరుణ, గ్రామంలోని తల్లులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి కుటుంబానికి బియ్యం వితరణ



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 10** గణపురం మండల కేంద్రానికి చెందిన పెండ్యాల తిరుపతి ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ సభ్యులు రౌతు కిషోర్, సామర్ల నాగరాజు, కొయ్యల రమేష్, అంజి, విన్ని, ఆనంద్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్..!

- -సంగెం ఎస్.ఐ. వంశీకృష్ణ



**సంగెం,ఏప్రిల్10(ప్రజాజ్యోతి ):** మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు సంగెం ఎస్ఐ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.వివరాల్లోకి వెళ్తే.. కాశీకుంటకు చెందిన సంతోష్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.ఈ మేరకు ఎస్ఐ వంశీకృష్ణ తన సిబ్బంది కానిస్టేబుళ్లు వీరన్న,నవీన్‌లతో కలిసి కుంటపల్లి గ్రామ సమీపంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఈ తనిఖీల్లో వరంగల్ నుండి సంగెం వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి,వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా,అనుమతులు లేకుండా మట్టి లేదా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.పట్టుబడిన ట్రాక్టర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## మత్తుకు దూరంగా..ప్రగతికి చేరువగా కుంటపల్లిలో పోలీస్ కళా బృందం చైతన్యం..!

- -ఆట పాటలతో ఆలోచింపజేసిన పోలీస్ కళా బృందం
- -సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి:సంగెం ఎస్.ఐ వంశీకృష్ణ



**సంగెం,ఏప్రిల్10(ప్రజాజ్యోతి ):** వరంగల్ నగర పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు,సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంటపల్లి గ్రామంలో 'జాగృతి'పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సామాజిక అంశాల పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు పాటలు,నాటికల ద్వారా యువత గంజాయి,డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని హితవు పలికారు.గంజాయి విక్రయించినా,సేవించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ,అక్రమ రవాణాపై సమాచారం ఉన్నవారు 8712584473 నంబర్‌కు పిర్యాదు చేయాలని కోరారు.ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ మోసాలు,బెట్టింగ్ యాప్స్ వల్ల కలిగే నష్టాలను నాటిక ద్వారా కళ్లకు కట్టినట్లు వివరించారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.బాల్యవివాహాలు,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన,రోడ్డు ప్రమాదాల నివారణ,మరియు వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించడం వంటి అంశాలపై కళాకారులు ప్రదర్శించిన పాటలు ప్రజలను ఆలోచింపజేశాయి. మూఢ నమ్మకాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు.ప్రతి గ్రామంలో భద్రత కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని,అత్యవసర సమయాల్లో డయల్ 100ను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగెం ఎస్.ఐ వంశీకృష్ణ,గ్రామ సర్పంచ్ సువర్ణ, హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్,వెంకటేశ్వర్లు,హోంగార్డులు శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు,పోలీస్ కళాబృందం సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం లో మండల నాయకులకు చోటు

- మంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన నాయకులు





**పలిమేల ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇద్దరికీ నూతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం లో చోటు దక్కించుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం లో మండలం లోని పంకెన గ్రామానికి చెందిన పిన్నింటి మధుసూదన్ రావు కు జిల్లా కార్యదర్శిగా మరియు కుమ్మరి అంజయ్యకు కార్యవర్గ సభ్యుడిగా నియమించారు ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అవకాశం ఇచ్చిన ఐటి మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు మరియు టి పి సి సి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ మాకు ఈ అవకాశం రావడానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించిన మండల నాయకులకు అధన్యవాదాలు తెలుపుతూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మండలం తో పాటు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

## కట్ట మైసమ్మ దేవాలయం నిర్మాణానికి 5 లక్షల విరాళం గుజ్జ సుమన్ రావు



**వర్ధన్నపేట,ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి.** వర్దన్నపేట కొనరెడ్డి చెరువు పై వున్నా కట్ట మైసమ్మ దేవాలయ నిర్మాణానికి,పండుగ నిర్వహణ కోసం వర్దన్నపేట పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ గుజ్జ సుమన్ రావు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, పట్టణ ప్రముఖులు సుమన్ రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ పనులకు ఎంత ఖర్చయినా భరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.తమ అభ్యర్థనపై వెంటనే స్పందించి భారీ విరాళం ప్రకటించిన సుమన్ రావును చైర్మన్ సారంగపాణి ఘనంగా సత్కరించారు. అలాగే, మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై తన చాంబర్‌కు తొలిసారి విచ్చేసిన సారంగపాణిని, కౌన్సిలర్ కుమారస్వామిని సుమన్ రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొండేటి సత్యం, సమ్మెట శ్రీనివాస్ గౌడ్, నాయకులు తుమ్మల యాకయ్య, ఎండి అప్సర్, తుమ్మల శ్రీధర్, పూజారి రఘు, మైస వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుడు సుదర్శన్ కుటుంబానికి పరామర్శ.!



**ప్రజాజ్యోతి-మల్హార్ రావు.ఏప్రిల్ 10** మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన దువ్వాసి సుదర్శన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఆర్ఎంపీ,పిఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్,తాడిచెర్ల వార్డు సభ్యుడు,సీనియర్ గ్రామీణ వైద్యుడు వొన్న తిరుపతి రావు,పెద్దతూండ్ల వార్డు సభ్యుడు, సీనియర్ గ్రామీణ వైద్యుడు జంబోజు రవిందర్,లింగన్న పేట శ్రీదర్ శుక్రవారం మృతుడు సుదర్శన్ కుటుంబాన్ని పరమర్శించి ఓదార్చారు.మృతుకి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం కావాలి

- జయముఖి ఫార్మసీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం
- చెన్నారావుపేటలో స్వచ్ఛ భారత్ కార్య క్రమం




**చెన్నారావుపేట ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని చెన్నారావుపేట సర్పంచ్ కంది శ్వేత రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జయముఖి ఫార్మసీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం స్వచ్ఛ భారత్ ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులు చేపట్టిన చొరవను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమ అధికారి పిఓ గోపు శ్వేత మాట్లాడుతూ..నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే పర్యావరణ నష్టాలను వివరించారు. ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార, కాగితపు సంచులను వాడాలని ఆమె సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధుల బారి నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. రాకేష్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని మోటివేట్ చేశారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సంతోష్ కుమార్ స్వయంగా వాలంటీర్లతో కలిసి పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీ కాలువల నిర్వహణ మరియు ప్లాస్టిక్ సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, బోధన సిబ్బంది స్థానిక గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి పి హెచ్ సి లో ఏమి జరుగుతోంది..? గణాంకాలు ఎక్కడ..?

- - డాక్టర్ ఉదయ్ రాజ్ ఆధ్వర్యంపై వివరాలు కోరిన ప్రజలు



**పర్వతగిరి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్ ఆధ్వర్యంలో గత ఒక సంవత్సర కాలంగా నిర్వహించిన వైద్య సేవలపై పూర్తి వివరాలు వెల్లడించాలని ప్రజలు మరియు స్థానిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఏప్రిల్ 1, 2025 నుండి 08 ఏప్రిల్ 2026 వరకు నిర్వహించిన సేవల గణాంకాలు బయటపెట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా సాధారణ డెలివరీలు, సిజేరియన్ డెలివరీలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు (ట్యూబెక్టమీ, వాసెక్టమీ), హైడ్రోసిల్ వంటి చిన్నపాటి శస్త్రచికిత్సలు, గాయాల కుట్లు, పుండ్లు తొలగింపు మరియు ఇతర ఇన్ఫెక్షన్ చికిత్సల వివరాలు స్పష్టంగా వెల్లడించాలని పేర్కొంటున్నారు. అదేవిధంగా, జనవరి 2026 నుండి ఇప్పటి వరకు నిర్వహించిన టీకాల కార్యక్రమంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బి, పెంటావాలెంట్, మీజిల్స్ ఎంఆర్, టిటి, కోవిడ్-19 టీకాలు,పిల్లల పూర్తి ఇమ్యూనైజేషన్ షెడ్యూల్‌లో భాగమైన టీకాల సంఖ్యలను అధికారికంగా ప్రకటించాలని అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై పారదర్శకత కోసం ఈ వివరాలు అవసరమని, సంబంధిత అధికారులు ఆలస్యం చేయకుండా పూర్తి గణాంకాలను వెల్లడించాలని స్థానికులు మండల ప్రజలు కోరుతున్నారు.



## అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది.

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు



**ప్రజాజ్యోతి-మల్హార్ రావు.ఏప్రిల్ 10** అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సోదరుడు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు.మండలంలోని వళ్లెంకుంట గ్రామానికి చెందిన బొమ్మ బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.శుక్రవారం శ్రీనుబాబు మృతుని కుటుంబాన్ని పరమర్శించి ఓదార్చారు.అధైర్య పడొద్దు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల బడితేల రాజయ్య,జిల్లా ఉపాధ్యక్షుడు ఐత రాజిరెడ్డి, కొయ్యూర్ సర్పంచ్ కొండ రాజమ్మ,ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, వళ్లెంకుంట సర్పంచ్ బొమ్మ రజిత,కాంగ్రెస్ నాయకుడు సారయ్య తోపాటు పలువురు పాల్గొన్నారు

## హెచ్పీవీ టీకాతో సర్వైకల్ క్యాన్సర్ నివారణ : డీఎంహెచ్ఓ డాక్టర్. కె. మల్లికార్జున రావు



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్. కె. మల్లికార్జున రావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్పీవీ) టీకాపై డీఎల్సీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలు మించని ఆడపిల్లల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు జిల్లాకు మొత్తం 1079 టీకాలు కేటాయించగా 625 మంది ఆడపిల్లలకు టీకాలు విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో వచ్చే వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు. డీసీహెచ్ఎస్ నరేంద్ర శర్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, డీడబ్ల్యూఓ కోదండరాములు, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

# రేషన్ బియ్యంలో భారీ గోల్‌మాల్?

- 50 కేజీ బస్తాలో 10 కేజీలు మాయం!
- పేదల అన్నం పై దోపిడి
- గోదాం నుంచి రేషన్ షాపుల వరకు అక్రమాల దందోరా
- బియ్యం బస్తాల్లో కోత
- అధికారుల నిర్లక్ష్యమా? లేక పెద్ద స్కాంలా?
- పిడిఎస్ బియ్యం మళ్లింపు ఆరోపణలు సరిహద్దు రాష్ట్రాలకు అక్రమ రవాణా?
- ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలు బహిర్గతం ఒక్కో బస్తాలో 10 కేజీలు తక్కువ!








**ఏటూరునాగారం, ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి**
జీసీసీ గోదాం ఆధ్వర్యంలో ఏటూరునాగారం కేంద్రంగా నాలుగు మండలాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెల వేల క్వింటాళ్ల బియ్యం సరఫరా జరుగుతున్నప్పటికీ, పంపిణీలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సివిల్ సప్లై శాఖ ద్వారా ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మండలాల్లోని రేషన్ షాపులకు, అలాగే జూనియర్, డిగ్రీ కాలేజీలు, కేజీవీబీ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకం కోసం బియ్యం సరఫరా జరుగుతోంది. నాలుగు మండలాల్లో కలిపి సుమారు 21,500 క్వింటాళ్ల బియ్యాన్ని మూడు నెలల ముందస్తు నిల్వగా సరఫరా చేస్తున్నట్లు సమాచారం.మండలాల వారీగా చూస్తే, ఏటూరునాగారంలో 27 రేషన్ షాపులకు 5,700 క్వింటాళ్లు, కన్నాయిగూడెంలో 13 షాపులకు 2,600 క్వింటాళ్లు, మంగపేటలో 44 షాపులకు 8,500 క్వింటాళ్లు, తాడ్వాయిలో 23 షాపులకు 4,600 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది.అయితే, రేషన్ షాపుల్లో బస్తాలను కొలిచినప్పుడు 50 కేజీల బియ్యం బస్తాల్లో కేవలం 38 నుంచి 41 కేజీలు మాత్రమే ఉన్నట్లు బయటపడుతోంది. ఒక్కో బస్తాలో 10–12 కేజీల వరకు తక్కువ ఉండటం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని, భారీ స్థాయిలో బియ్యం మళ్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు పర్యవేక్షణ లోపంతో కొందరు తమ ఇష్టానుసారంగా ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ, సరిహద్దు రాష్ట్రాలకు తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.38 కేజీల బియ్యం మాత్రమే ఉన్నాయి

**››› జాడి సమ్మయ్య**

రేషన్ దుకాణంలో మూడు నెలల బియ్యం తీసుకోవడం జరిగింది 50 కేజీల బియ్యం కాంట వేయగా 38 కేజీలు మాత్రమే ఉన్నాయి 12 కేజీల బియ్యం తక్కువగా రావడం జరిగింది. 10kgల బియ్యం మాయం

**››› గికురు లింగయ్య**

మూడు నెలల రేషన్ బియ్యం తీసుకోవడంతో 50 కేజీల బియ్యం బస్తా తూకం వేయగా 10 కిలోల బియ్యం మాయమయ్యాయి. బస్తాకు పది పన్నెండు కేజీలు తక్కువగా వస్తున్నాయి.

## పుట్టినరోజున సేవా సంకల్పం

- ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి శ్రీకారం
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ వినూత్న కార్యక్రమం



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి):** పుట్టినరోజులను ఆడంబరాలకు కాకుండా సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే సందేశాన్ని చాటి చెబుతూ సత్యం గ్రూప్స్ ఫౌండర్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ వినూత్న కార్యక్రమంతో ముందుకు వచ్చారు. తన 45వ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ఆదర్శంగా నిలిచారు. సాధారణంగా పుట్టినరోజుల సందర్భంగా జరిగే ఫ్లెక్సీలు, కేక్ కటింగ్ లు, పటాకులు వంటి వ్యర్థ ఖర్చులకు దూరంగా ఉండి ఒక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నిధులు వినియోగించడం విశేషం. పాఠశాలలో విద్యార్థులకు సరైన మూత్రశాల సౌకర్యం లేకపోవడాన్ని గుర్తించిన ఆయన కొత్త టాయిలెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అదనంగా పాఠశాల భవనంలో ఫ్లోరింగ్ పనులు కూడా చేపట్టి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, పుట్టినరోజులు, పెళ్లి వార్షికోత్సవాల పేరుతో భారీగా ఖర్చు చేయడం కంటే, అదే డబ్బుతో సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తే నిజమైన సంతృప్తి లభిస్తుంది అని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తూ, మరింత మంది ప్రజాప్రతినిధులు ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ స్వామి, గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు మరియు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

- చెన్నారావుపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం.
- క్వింటాకు రూ.2400 మద్దతు ధర.
- దళారులను నమ్మి మోసపోవద్దు: రైతులకు ఎమ్మెల్యే పిలుపు.



**చెన్నారావుపేట ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని తిమ్మరాయినీ పహాడ్ రోడ్డు మార్గంలో, రాడపాక బాబు భూమిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ మార్క్ ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే దొంతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ.2,400 మద్దతు ధర ప్రకటించిందన్నారు. బయట మార్కెట్‌లో దళారులకు అమ్ముకోవడం వల్ల రైతు క్వింటాకు రూ. 600 వరకు నష్టపోతున్నాడని, ఆ నష్టాన్ని నివారించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మండలంలో సాగవుతున్న 14 వేల ఎకరాల మొక్కజొన్న పంట ద్వారా సుమారు రూ. 10 కోట్లకు పైగా రైతులకు అదనపు లబ్ధి చేకూరనుంది. ఇది రైతు భరోసా కంటే ఎక్కువని ఆయన పేర్కొన్నారు.ఎకరానికి 26 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నామని, అంతకంటే ఎక్కువ పండిన రైతుల సమస్యను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన, ఆరబోసిన మొక్కజొన్నలను తీసుకురావాలని సూచించారు. శనివారం రైతులకు అందుబాటులోకి 25 వేల బస్తాలు రానున్నట్లు తెలిపారు.అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇప్పించాలని, సాదా బైనమా సమస్యలు పరిష్కరించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పట్టాలు అందేలా చూస్తానని, సాదా బైనమా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అలాగే మండలంలో మరో రెండు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లా సహకార అధికారి (డి.సి.ఓ) నీరజ మాట్లాడుతూ.. రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేంద్రాలను మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, తహసిల్దార్ అబిద్ అలీ, ఇన్చార్జ్ ఎంపీడీవో ఆయేషా పర్వీన్, ఏవో జెపాల్ రెడ్డి,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రషీద్, సీఈవో చిట్టే రవి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండల కేంద్రంలోని సర్పంచులు ఉప సర్పంచులు వార్డ్ మెంబర్లు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రంగశాయిపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి):** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకుడు, ప్రముఖ న్యాయవాది శేర్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంట రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ యువ నాయకుడు గంట రవికుమార్ పార్టీ అభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో వరంగల్ మేయర్ పీఠాన్ని భారతీయ జనతా పార్టీ దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ వరంగల్ నగరంలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 42వ డివిజన్‌లో కాషాయ పతాకం ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా రంగశాయిపేట నెహ్రూ సెంటర్‌లోని బొడ్రాయి వద్ద బ్రాహ్మణుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం బాటసారులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ 42వ డివిజన్ నాయకులు శ్రీరామోజు మోహనాచారి, కపిల్ కుమార్, దూడే పరమేష్, దుబ్బాల అశోక్, గుండు రాజు, దారబోయిన అనిల్, పందిరి చంద్రశేఖర్, బోయిన రాజు, మండల మొగిలి, కొంగండి శ్రీను, ఈగ రవి, గుండు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకుల సమ్మయ్య తల్లి అంత్యక్రియలలో పాల్గొనీ నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**రాయపర్తి ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల సమ్మయ్య తల్లి శుక్రవారం అనారోగ్యంతో మరణించగా వారి పార్థివా దేహానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాయపర్తి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఆశ్రఫ్ పాషా, మాజీ సర్పంచ్ చిన్నల రాజబాబు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగతో శరీరం, మనసు, ఆత్మ సమ తుల్యత సాధ్యం

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద





**వరంగల్ సిటీ, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి ):** శరీరం, మనసు, ఆత్మ సమతుల్యతకు యోగాయే ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆరోగ్య థీమ్‌లో ఐదో రోజు సందర్భంగా శుక్రవారం ఖిలా వరంగల్‌లో "ప్రపంచ హోమియో పతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవం" వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభూ దేవాలయం వద్ద నిర్వహించిన యోగ ప్రదర్శనలో కలెక్టర్ డా. సత్య శారద స్వయంగా యోగాసనాలు చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగను భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం "ఫాదర్ ఆఫ్ ఆయుష్"గా గుర్తింపు పొందిన డా. శామ్యూల్ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి ఖిలా వరంగల్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్ హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయుష్ వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జ్ ఎం. రాజు, డీపీఎం రాజు, నేచురోపతి మెడికల్ ఆఫీసర్ డా. అమృత వల్లి, ఆయుష్ వైద్యులు డా. రాజేందర్, డా. రాము, డా. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## దళారుల మాయకు గురికావద్దు.. పంచాయతీ సేవలు నేరుగా పొందండి

- మండల పంచాయతీ అధికారి శేషాంజన్ స్వామి



**పర్వతగిరి, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండలంలోని ప్రజలకు మండల పంచాయతీ అధికారి శేషాంజన్ స్వామి(ఎంపిఓ) విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ద్వారా అందించే వివిధ సేవలు, సర్టిఫికెట్లు పొందేందుకు మధ్యవర్తులు (దళారులు) ఆశ్రయించవద్దని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల ద్వారా జనన, మరణ సర్టిఫికెట్లు, షాప్ ట్రేడ్ లైసెన్స్, ఇంటి యాజమాన్య ధృవపత్రం, గృహ నిర్మాణ అనుమతి, ఆస్తి మార్పిడి వంటి అన్ని సేవలు నిబంధనల మేరకు నేరుగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు అవసరమైన పత్రాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శులను నేరుగా సంప్రదిస్తే, సంబంధిత దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారికి సేవలు అందజేస్తామని చెప్పారు. మధ్యవర్తులను ఆశ్రయించడం వల్ల తప్పుడు (ఫోర్జరీ) సర్టిఫికెట్లు పొందే ప్రమాదం ఉందని, అవి ఎటువంటి ఉపయోగం లేకపోవడమే కాకుండా ఆర్థిక నష్టంతో పాటు చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయని హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నెట్ సెంటర్ల ద్వారా నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిన ఘటనలు బయటపడటంతో, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కావున మండల ప్రజలు ఎవ్వరూ ఇలాంటి మోసాలకు గురికాకుండా, పంచాయతీ సేవలను నేరుగా అధికారుల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు కూడా ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించి సహకరించాలని ఎంపిఓ కోరారు.

# పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

- 22 మందికి రూ.16 లక్షల సహాయం



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని మాజీమంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. శుక్రవారం బస్వరాజ్ సారయ్య నివాసంలో నగరానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.16 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం భారీగా ఖర్చు చేసిన పేదలు సమర్పించిన దరఖాస్తులను సారయ్య ముఖ్యమంత్రి కార్యాలయానికి సిఫారసు చేయగా, ప్రభుత్వం వాటిని ఆమోదించి సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం పొందదలచిన వారు నేరుగా తనను సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయూబ్, కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష, పీసీసీ సభ్యులు నల్లగొండ రమేష్, సీనియర్ నాయకులు రాజనాల శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు తత్తరి లక్ష్మణ్, జన్ను రవి, ధూపం సంపత్, జన్ను వరుణ్, బిల్లా శ్రీకాంత్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గోరంట్ల రాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎండి సలీం, ఎన్ఎస్‌యూఐ నాయకుడు చాగంటి శ్రీనివాస్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ లక్ష్మి, నగర పార్టీ మహిళా అధ్యక్షులు నారగోని స్వప్న మురళీ గౌడ్ మరియు పలు డివిజన్ ల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెల్తుర్లపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం

- వెనక నుండి ఆటోను ఢీ కొట్టిన లారీ
- ఆటోలో ఉన్న 23 మంది కూలీలకు గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సీతక్క







**వెంకటాపూర్ ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి ):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం వెల్తుర్లపల్లి గ్రామానికి చెందిన 23 మంది కూలీలు శుక్రవారం ఉదయం మిర్చి పంట ఏరేందుకు ఆటోలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో 23 మంది కూలీలు గాయపడగా, వారిని వెంటనే ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వెల్తుర్లపల్లి క్రాస్ దగ్గర కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుండి లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో ఉన్న కూలీలు తీవ్రంగా గాయపడడం జరిగింది. 23 మంది క్షతగాత్రులలో గంటోజు సుగుణ, కడారి శ్రీలతకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి బాలరాజు పైలట్ విజయ్ ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసు కోవడానికి పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ములుగు జిల్లా ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అవసరమైన అన్ని వైద్య సదుపాయం కల్పించాలని, మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గాయపడిన వారి పరిస్థితిని వైద్యులు వెల్లడించారు. ప్రభుత్వం తరఫున బాధితులకు పూర్తి సహాయం అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

## టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మార్చి 10 (ప్రజా జ్యోతి )** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వార్షిక తనిఖీల్లో భాగంగా టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడం ఈ తనిఖీ యొక్క ముఖ్య ఉద్దేశంగా తెలిపారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్టేషన్ ప్రాంగణ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

## హిందువుల ఐక్యతే , జాతీయ సమైక్యత

- హిందూ ధర్మ సమ్మేళన సమితి అధ్యక్షుడు తౌటం నవీన్

**చిట్యాల (ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 10,** మండల కేంద్రంలో హిందూ ధర్మ సమ్మేళనం సమితి కరపత్రాలను శుకవారం అధ్యక్షుడు తౌటం నవీన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు అనంతరం నవీన్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన బుధవారం సాయంత్రం 4. 30 నిమిషాలకు రామాలయ గ్రౌండ్ చిట్యాల లో జరిగే సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా పూజ్య బ్రహ్మ శ్రీ జ్ఞాన చైతన్య నంద స్వామి వస్తున్నారు కావున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేశానికి ఆత్మ హిందూ ధర్మం హిందూ సంస్కృతి మరియు హిందూ సమాజం కావున హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వ గురువుగా నిలుపాలనే లక్ష్యంతో నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాలను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరం కావున ఈ హిందూ సమ్మేళన కార్యక్రమంలో మనం కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరుచున్నాముఈ కార్యక్రమంలో RSS జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య ఎలేటి రామయ్యపల్లి సర్పంచ్ కోడారి అశోక్ , కోటంచ డైరెక్టర్ దొడ్డి కిష్టయ్య మాజీ సర్పంచ్ పుల్లూరి రమాదేవి సతీష్, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు ముదన నాగరాజు నేపాలి రాకేష్ బండి రాజు మాటూరి లవన్ బాబు చింతల రాజేందర్ రాయిని శ్రీనివాస్ కేంసారపు ప్రభాకర్ గుండా మణి కుమార్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.